మన జీవిత కథలు

ఆమెను గురించి కథ వ్రాయాలని చాలా రోజులనుండీ అనుకుంటున్నాను. కానీ యేమి వ్రాయాలో్న యెప్పుడూ తోచలేదు. యెంత ఆలోచించినా కథకు పనికివచ్చే విషయం ఆమెలో యేమీ కనిపించలేదు. ఆమె జీవిత మంతా వెదకినా కథావస్తువు కాగల ఘటనే కనపడదు. జీవితంలో కాని, జీవిత విధానంలో కాని యే విశేషమూ లేకుండా యేమని కథ వ్రాయడం?

మూడేండ్లనుండి నేను ఆమె యింటి ప్రక్కనే కాపురం వుంటు న్నాను. మా రెండిండ్లకూ ఒకటే వసారా. రేయీ పగలూ యెప్పుడూ ఆ ఉమ్మడి వసారాలో వుంటుంది ఆమె — మంచంమీద కూర్చొనో, పండుకొనో. వేళకు నాలుగు మెతుకులు యెప్పుడు వండుకొని తింటుందో, తక్కినప్పుడంతా ఆ వసారాలోనే ఆమె జీవితం. ఈ యింటిలో చేరిన తొలిరోజుల్లోనే యెప్పుడో నాకు తెలియకుండానే బుద్ధి పుట్టింది — ఆమెను గురించి కథ వ్రాయాలని. అప్పటినుండి ప్రయత్నం చేస్తూనే వున్నాను. కానీ యెంత ఆలోచించినా కథకు ఒక రూపం యేర్పడనేలేదు.

ఒకటి రెండుసార్లు నిరాశ కూడా కలిగింది — కథకు పనికి వచ్చేది ఆమెలో యేమీ లేదేమో అని. కానీ — యేమీ లేకపోతే వ్రాయాలని నాకెందుకు బుద్ధి పుట్టింది — అనే ప్రశ్న నన్ను పీడిస్తూ వుంది. యెంత దీర్ఘంగా ఆలోచించినా యేమీ స్ఫురించదు. నమ్మకం మాత్రం బలంగా వుంది — కథ కాతగింది యేదో ఆమె జీవితంలో వుందని.

రోజూ సాయంత్రం నేను ఆఫీసునుండి వచ్చేటప్పటికి ఆమె మంచం మీదనే వుంటుంది. యెప్పుడైనా ఒకసారి పలకరించేవాణ్ని —

"యేం చేస్తున్నావ్ పెద్దమ్మా" అంటూ. నా భార్య మరేమీ పొద్దుపోకపోతే "ఈ రోజు ఏమి కూర చేసుకున్నావు పెద్దమ్మా ?" అంటూ వచ్చి ఆమెతో కాసేపు కాలక్షేపం చేసేది. మేము పలకరిస్తే బాగానే మాట్లాడుతుంది — కానీ ఆ మాటల్లో ఆమె కేమీ ఆసక్తి వున్నట్లు కనపడదు.

ఆమె జీవితంలో నాకు తెలియని విశేషాలు యేమైనా వున్నాయేమోనని యిరుగు పొరుగులను విచారించినాను. యెంత మందిని విచారించినా అంతకు ముందే నాకు తెలిసిన దానికంటె యెవరూ యేమీ చెప్పలేదు.

ఆమెకు యాభై యేండ్ల వయస్సు వుంటుంది. ఐదారేండ్ల క్రితం భర్త మరణించినాడు. ఒక కొడుకూ కూతురూ వున్నారు. ఆ కొడుకెక్కడో మరొక వూర్లో ఉద్యోగము చేస్తున్నాడు. కూతురు కాపురానికి పోయి పదేండ్లు దాటింది. యే సంవత్సరానికో ఒకసారి కొడుకు వచ్చి చూసి పోతాడు. యే ఆరు మాసాలకో ఒకసారి కూతురు ఉత్తరం వ్రాస్తుంది. అంతకు మించి ఆమె నిత్యజీవితంలో యేమీ మార్పులేదు. యింత చలనం లేని జీవితాన్ని గురించి ఏమని కథ వ్రాయడం ?

నిన్న సాయంత్రం ఆరుగంటలకు నేనూ, నా భార్యా సినిమాకు పోతూ "పెద్దమ్మా సినిమాకు పోదాం రా" అని పిలిచినాను.

"పోయి రాండి నాయనా" అంటూ ఆమె ముక్తసరిగా జవాబు చెప్పింది.

"పోదాంరా పెద్దమ్మా — మంచి సినిమా వచ్చింది" అని నా భార్య చనువుగా పిలిచింది.

" నాకెందుకమ్మా సినిమాలూ నాటకాలూ — మీరు పోయిరాండి" అంటూ ఆమె సమాధానం చెప్పింది.

సినిమాకు పోతూ నా భార్యతో అన్నాను: "యీమె రోజంతా యేం చేస్తూ వుంటుందో!"

"ఆమెకేం! హాయిగా వుంటుంది — చీకూ చింతా యేమీ లేకుండా" అన్నది నా భార్య — యే కొంచెమో అసూయపడుతూ.

"అట్లా హాయి నీకూ కావాల్నా — పిల్లామేకా యెవరూ లేకుండా — మగడు కూడా లేకుండా?" అన్నాను.

"ఛీ — అది కాదండీ. మరీ తల బరువు సంసారం కంటే యెవరూ లేకపోవడం మేలుగాదా!"

"యెవరూ లేకపోతే మనిషికి దిక్కు తెలుస్తుందా? జీవితంలో యే ఆసక్తీ లేకుండా, యే వ్యాపకమూ లేకుండా బ్రతకడం సాధ్యమేనా?"

"మరి ఆమె బ్రతుకుతూనే వున్నదిగా!"

నిజమే ఆమె బ్రతుకుతూనే వుంది. కానీ యేమి చూసుకొని బ్రతుకుతూ వుందనేదే ప్రశ్న. ఆలోచిస్తూ నడుస్తూ వుండినాను. కాసేపున్న తర్వాత నా భార్య అడిగింది: "ఆమెను గురించే ఆలోచిస్తున్నారా?"

"అవును" అన్నాను. "ఆమె జీవిత రహస్యం తెలుసుకోవాలని వుంది."

"రహస్యాలు యేముంటాయండీ — అందులోనూ ఆడవాళ్ళకు!"

"అవున్లే — జగదేక సత్యం చెప్తున్నావు" అన్నాను నవ్వుతూ. నా భార్య కూడా నవ్వింది.

మరి కాసేపున్న తర్వాత మెల్లగా అన్నాను: "ఆమె యెప్పుడైనా కాలు జారిందేమో?"

హఠాత్తుగా నిలబడింది నా భార్య. "అవేం మాటలండీ! ఆడ వాళ్ళంటే అంత చులకనా మీకు?"

"సరేలే — సినిమాకు ప్రైమౌతున్నది నడు" అంటూ మళ్ళీ నడక సాగించినాము. ఆ ఆలోచన మాత్రం నన్ను వదలకుండా వుంది. ఆమె జీవితంలో ఏదయినా తప్పు చేసి బాధపడుతూ వుందేమో? పశ్చాత్తాపం మనిషిని యెంతైనా క్రుంగదీస్తుంది. లేకపోతే దేనిమీదా శ్రద్ధా ఆసక్తి లేకుండా అంత నిరుత్సాహంగా యెట్లా బ్రతకగలుగుతుంది! మరొక అనుమానం కూడా వచ్చింది. ఆమె ఏదైనా చేయరాని తప్పు చేసి వుంటే పాపపరిహారానికి మన దేశంలో సులభమైన పద్ధతు లున్నాయి. రోజూ కాసేపు గీతాపారాయణ చేసుకోవచ్చు. వారాని కొకసారి గుడికి పోవచ్చు, అప్పుడప్పుడూ భజన చేయవచ్చు. యీ మార్గాలేవీ ఆమె అనుసరించలేదు. ఆమెను పీడించేది పశ్చాత్తాపం కాదేమో? ఆమెలో దిగులేమీ కనపడదు. ఆమెలో వున్నదంతా అశ్రద్ధ, అనాసక్తి, నిరుత్సాహం — అంతే.

ఈ దినం మధ్యాహ్నం యింట్లో పండుకొని వున్నాను — ఆఫీసుకు సెలవు కావడం వల్ల. నా భార్య వంట యింట్లో పని ముగించుకొని వసారాలోకి పోయింది, పెద్దమ్మతో ముచ్చట్లు చెప్పుకోడానికి.

"సినిమా చాలా బాగుంది పెద్దమ్మా. నీవెంత రమ్మన్నా రాకపోతివి" అంటూ నా భార్య ఉత్సాహంగా ఆరంభించింది.

"ఏం సినిమాలు లేమ్మా — పొద్దుపోని సినిమాలు" అన్నది పెద్దమ్మ నిరుత్సాహంగా.

"నిజంగా పెద్దమ్మా — చాలా మంచి సినిమా. కథ చెప్పమంటావా?" అన్నది నా భార్య మరీ ఉత్సాహంతో.

"కథలకేమి లేమ్మా — మన బ్రతుకులన్నీ కథలు కావూ?"

నిద్రపోవడానికి ప్రయత్నం చేస్తూ వుండిన నాకు ఆ మాటలు వినేటప్పటికి నిద్రమత్తంతా వదిలింది. ఆమె జీవితంలో ఏదో కథ వుంది.

ఏమైందీ నాకు అంతు చిక్కలేదు. కానీ ఏదో తప్పక వుంది. యిప్పుడైనా తెలుస్తుందేమ్మా అని శ్రద్ధగా వినసాగినాను.

"మన బ్రతుకుల్లో యేమి కథలున్నాయి పెద్దమ్మా? నిన్నటి బ్రతుకే యీ రోజూ, యీ రోజు బ్రతుకే రేపూ — అంతా గానుగెద్దు బ్రకుకు!"

"అంతేమ్మా, అంతకంటె యెవరి బ్రతుకుల్లో ఐతే యేముంటాయి?"

"అది కాదు పెద్దమ్మా, మన బ్రతుకుల్లో కథ యేముందీ అని? వంటిల్లు వదిలితే వసారా — పడక గది విడిస్తే పురిటి గది. యిందులో కథ యేముంది పెద్దమ్మా?" నా భార్య ఆమెను కవ్విస్తూంది.

"కథలో మాత్రం యింకేముంటుందమ్మా? కథలన్నీ అంతే."

"పోనీ, నీ కథే చెప్పు. నీ జీవితంలో యేమేమి జరిగిందో చెప్పు వింటాను."

పెద్దమ్మ నిర్లిప్తంగా అన్నది: "నా కథ యేముంది తల్లీ — అందరి కథలూ వున్నట్లే నా కథా."

"అదే చెప్పు" నా భార్య గోముగా అడిగింది. నేను యింకా శ్రద్ధగా వినసాగినాను.

"చెప్పడానికి యేముందమ్మా నా బ్రతుకులో. అందరి మాదిరే నేనూ పుట్టి పెరిగినాను. అందరినీ పెంచినట్లే మావాళ్ళూ నన్ను పెంచినారు. పదారేండ్లు దాటుతూనే అందరికీ ఐనట్లే నాకూ పెండ్లయింది. తరువాత నాలుగేండ్లలో ఒక కొడుకూ, కూతురూ పుట్టినారు. యింతకంటె యేముందమ్మా నా బ్రతుకులో!" పెద్దమ్మ ముగించింది. నాకు ఆశాభంగమైంది.

"తరువాత యేం జరిగింది పెద్దమ్మా?" నా భార్య చాలా ఆసక్తిగా ప్రశ్నించింది.

పెద్దమ్మ అదే నిర్లిప్త కంఠంతో చెప్పింది. "యేం జరుగు తుందమ్మా తరువాత? మామూలుగా జరుగవలసిందే జరిగింది. కొడుకూ, కూతురూ పెరిగి పెద్దవాళ్ళయినారు. కూతురుకు పెండ్లిచేసి అత్తగారింటికి పంపినాము. ఆమె కాపురం ఆమె చేసుకుంటూ వుంది. కొడుకు ఉద్యోగము చేసుకుంటూ తన బ్రతుకు తాను బ్రతుకుతున్నాడు." యీ సారి నాకు పెద్దమ్మ మీద కోపం కూడా వచ్చింది. ఏదో వున్నట్లు ఆశ కల్పించి కడకు ఏమీ లేకుండా చేసింది.

కొంచెం సేపు యెవరూ మాట్లాడలేదు. నా భార్య ఆలోచిస్తూ వుండిందేమో. ఒక నిమిషం తర్వాత మళ్ళీ నా భార్య కంఠం వినపడింది. "చిన్నప్పుడు నీవు చాలా కష్టపడినావా పెద్దమ్మా?"

"ఏమీ లేదమ్మా. మామూలు కష్టాలు తప్పితే యేమి కష్టాలు వుంటాయి! మరీ అల్లరిచేస్తే పెద్దవాళ్ళు తన్నకుండా వుంటారా? అమ్మ తంతే నాన్న బుజ్జగించేవాడు. నాన్న తంతే అమ్మ సముదాయించేది. కాకపోతే చిన్నప్పుడు యెంత కష్టమైనా కాసేపు యేడిస్తే అదే పోతుంది."

మళ్ళీ ఒక క్షణం ఆలోచించినట్లుంది నా భార్య. "నీకు యిష్టం లేని పెండ్లి చేసినారా పెద్దమ్మా?" నా భార్య తెలివికి నాకు ఆశ్చర్యం కలిగింది. సరిగా నేను అడగదలచుకున్న ప్రశ్నలే అడుగుతూ వుంది. నా కోసమే అడుగుతున్నట్లుంది. జవాబు కొరకు ఆతురతతో యెదురు చూసినాను.

"యిష్టం లేకేమ్మా? తగిన సంబంధమనే మా వాళ్ళు యిచ్చినారు. ఐనా పదారేండ్ల ఆడపిల్లలకు యిష్టాలూ అయిష్టాలూ యేముంటాయి గనుక!"

"అడుగుతున్నానని మరేమీ అనుకోకు పెద్దమ్మా — మీ కాపురం అన్యోన్యంగానే వుండిందా?"

"అన్యోన్యం లేకేమమ్మా? మా ఆయన మరీ దుర్మార్గుడేమీ కాదులే — మామూలు మనిషే."

"ఐతే మీ కెప్పుడూ పొరపొచ్చా లేమీ రాలే దన్నమాట?"

"ఏవో మామూలు తగవులు రాకుండా వుంటాయా తల్లీ! యెప్పుడైనా వంట ఆలస్యంగా ఐతే కోపగించుకునేవాడు. లాంపు పెద్దగా వెలుగుతూ వుంటే చీవాట్లు పెట్టేవాడు."

"మీరెప్పుడూ పోట్లాడుకోనేలేదా పెద్దమ్మా?"

"యెందు కొస్తాయమ్మా పోట్లాటలు? మన మేం అల్లరి వాళ్ళమా చిల్లర వాళ్ళమా? యెప్పుడో ఒకసారి — పెండ్లయిన మొదటి సంవత్సర మనుకుంటాను — పండుగకు పుట్టింటికి పోవాలని ప్రయాణమైనాను. అంతా ప్రయాణమై కూర్చున్నాక, అప్పుడు పోవద్దన్నాడు. ఆ పూటంతా అన్నం తినలేదు. పోట్లాడుదామనుకున్నాను గానీ, కొత్తచీర కోయం బత్తూరిది తెచ్చి పండుగకు కట్టుకొమ్మన్నాడు. అన్నీ తెలిసీ తెలియని చేష్టలు లేమ్మా — చిన్న వయస్సు గదూ!"

నా భార్యకు ఏమర్థమయిందో ఏమో? నాకు మాత్రం అంతా అయోమయంగా వుంది,

"తరువాత యేం జరిగింది పెద్దమ్మా — కొడుకూ కూతురూ వెళ్ళి పోయిన తర్వాత?"

"యేముందమ్మా, ఐదారేండ్లు మామూలుగానే జరిగిపోయినాయి. ఒకనాడు జబ్బుగా వుందని పండుకున్నాడు. అంతే — మళ్ళీ లేవలేదు. యిరవై రోజుల తర్వాత నన్ను ఒంటరిగా వదలిపెట్టి పోయినాడు." యీ

మాటలు కూడా ఆమె మామూలుగానే అన్నది. కంఠంలో యే ఉద్వేగ సూచనలూ లేవు. వాళ్ళ సంభాషణ నాకు విసుగైంది. యింక యెంత సేపున్నా ఆమెను గురించి తెలుసుకోతగింది యేమీ వుండదని నిరాశ చేసుకున్నాను.

"ఐతే యింతకంటె విశేషాలేమీ లేవా పెద్దమ్మా, నీ జీవితంలో?"

"యింతకంటె యెవరి జీవితంలో ఐతే యేముంటాయమ్మా!"

"జీవితంలో నీ కింకేమీ కోరికలు లేవా?"

"యీ వయస్సులో యింకా యేమి కోరికలు వుంటాయి తల్లీ! కాలూ చేయీ పడిపోకముందే చావు రావాలనే దొక్కటే కోరిక."

"అయితే జీవితంలో నీ కోరికలన్నీ తీరినాయా పెద్దమ్మా? తీరని కోరికలంటూ యేమీ లేవా నీకు?"

"యేమి కోరిక లుంటాయమ్మా ఆడవాళ్ళకు? చీరలో, నగలో, అల్లతే గదూ? అవైనా ఒకరిద్దరు పిల్ల లయిందాకానే? తర్వాత యింకే కోరికలూ వుండవు."

కొద్ది క్షణాలు నిశ్శబ్దం. "యింకొక్కమాట చెప్పు పెద్దమ్మా. ఎప్పుడూ ఆలోచిస్తూ వుంటావే, యేదో తప్పు చేసి బాధపడుతూ వున్నట్లు — యేదైనా చేయరాని పని చేసినావా యెప్పుడైనా?"

యీ ప్రశ్నకు ఆమె కోపగించుకుంటుందేమో అనుకున్నాను. కోపం తాపం ఏమీ లేకుండా మామూలుగానే సమాధానం చెప్పింది. "చేయరాని పనులెందుకు చేస్తామమ్మా మనబోటి వాళ్ళం! మనకేం మర్యాదలు తెలియవూ! ఉన్న మర్యాద పోయిన తర్వాత బ్రతగ్గలమా తల్లీ మనం!"

వెధవగోల వినలేక ముసుగు పెట్టి పండుకున్నాను. తరువాత నా భార్య యింకా యేమేమి ప్రశ్నల పరంపర కురిపించిందో ఆమెమీద — నాలుగు గంటలకు నేను నిద్రలేచి కాఫీ కొరకు ఇంట్లోకి పోగానే "పెద్దమ్మ కథ విన్నారా ?" అన్నది.

"అంతా వినగేదులే, ఆమె జీవిత రహస్య మేమైనా తెలిసిందా ?" అన్నాను.

నా భార్య జాలిగా చిరునవ్వు నవ్వుతూ చెప్పింది. "రహస్యం యేముంటండీ! పాపం అడగరాని ప్రశ్నలన్నీ అడిగినాను — మీ మీద నమ్మకంతో. కోపం తెప్పించే ప్రశ్నలు కూడా అడిగినాను. కోపమూ, విసుగూ యేమీ లేకుండా అన్నిటికీ సమాధానం చెప్పింది."

"అయితే ఆమె జీవితంలో యేమీ విశేషం లేదంటావా ?"

"ఏమీ లేదు. చెప్పుకోదగిన విశేషం ఏమీ లేదు. ఆమె చాలా మామూలు మనిషి."

"చాలా మామూలు మనిషి ! యింత మామూలు మనిషిని గురించి ఏమని కథ వ్రాయడం !" అన్నాను.

నా బాధ కంఠంలో ధ్వనించిందేమో — కాలే కాఫీ గ్లాసు విసురుగా నా చేతిలో పెట్టి నా భార్య తీవ్రంగా అన్నది: "మీ దిగులంతా కథను గురించే. ఆమెను గురించి మీ కేమాత్రం విచారం లేదు కదూ ?"

నా భార్య ప్రవర్తన నాకు అర్థమే కాలేదు.

(నవంబర్ 1959)